క్లుప్తంగా

బదిలీ అధికారికి సన్మానం



భానోజీరావును సన్మానిస్తున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు

నెల్లిమర్ల: బదిలీపై వెళ్తున్న నెల్లిమర్ల ఈఓపీఆర్డీ హెచ్.భానోజీరావును ఎంపీడీఓ జి. రామారావు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు గురువారం ఘనంగా సన్మానించారు. భానోజీరావుకు తాజాగా అనకాపల్లి జిల్లాకు బదిలీ జరిగింది. ఈ సందర్భంగా భానోజీరావు చేసిన సేవలను ఎంపీడీఓ, సిబ్బంది కొనియాడారు. కార్యక్రమంలో రాంజీరావు, రమణ, సర్వేశ్వరరావు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి..



ధర్నా చేస్తున్న శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు

విజయనగరం ఫోర్ట్: ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్ వైజర్లకు సకాలంలో జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఘోషా ఆస్పత్రిలో శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, రోగులకు ఇబ్బంది కలగకుండా కార్మికులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఆస్పత్రులను శుభ్రం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీను, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాస్త్రం తయారీపై వివరించారు. ఈ కషాయంతో ఆకుముడత, పచ్చ పురుగులను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది గాయత్రి, రామలక్ష్మి, కృష్ణ, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి..



వినతిపత్రం అందుకుంటున్న డాక్టర్ శంకరరావు

విజయనగరం అర్బన్: దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, 2010 అక్టోబర్‌లో టూరిజం కార్పొరేషన్ యాజమాన్యం చేసిన ఒప్పందాన్ని అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కలిపించాలన్నారు. చైర్మన్ స్పందిస్తూ టూరిజం కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. చైర్మన్‌ని కలిసిన వారిలో కార్మికుల సంఘ జనరల్ సెక్రటరీ అంజలిరావు, స్టేట్ సెక్రటరీ బాబూరావు, సంఘ నాయుకులు ఉన్నారు.

21న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రాంతీయ సదస్సు

విజయనగరం ఫోర్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఎస్సీ ముఖ్య న్యాయకులతో సామాజిక న్యాయ బస్సుయాత్ర సన్నాహక సమావేశం అక్టోబర్ 21వ తేదీన ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురగా ఉన్న రెవెన్యూ కల్యాణ మంటపంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు (ఎమ్మెల్సీ) డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, జూపూడి ప్రభాకరరావు, ఎంపీ నందిగాం సురేష్, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి ఎస్సీ విభాగ కమిటీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పనసరిగా హాజరు కావాలని కోరారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో మెరుగైన వైద్య సేవలు

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



డెంకాడ: వైద్య సేవలు అందించిన డాక్టర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



భోగాపురం: రావాడలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రావాడలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి, వారిని సకాలంలో మంచి ఆస్పత్రులకు తరలించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. ఈ వైద్యశిబిరంలో ఏడు రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని, మెరుగైన చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి కార్యక్రమాలకు రూపకల్పన చేయలేదని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. వైద్య శిబిరానికి 716 మంది హాజరయ్యారని పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యుడు టి. తిరుపతిస్వామి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, సర్పంచ్ అప్పుభుక్త పైడినాయుడు, వాసుబాబు, మండల ప్రత్యేకాధికారి సుధారాణి, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, వైద్యులు సహన సంతోషి, పీపీ అనూష, నవీన్, సత్యవతి, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సేవలు భేష్..

డెంకాడ: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా సమర్థవంతంగా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బంటుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రోగులకు మందులు అందజేశారు. అలాగే రోగులకు మెరుగైన వైద్యసేవలందించిన వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిక్కాల హేమలత, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, పీఏసీఎస్ డైరెక్టర్ చిక్కాల జనార్ధనరావు, వైస్ ఎంపీపీలు పిన్నింటి తమ్మునాయుడు, కూరాలకు అనిత, పేడాడ సర్పంచ్ పుర్రె సంతోషి, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: పతివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధురాలికి మెడికల్ కిట్ అందజేస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

విజయనగరం: ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరిచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తోందని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు తెలిపారు. జమ్ము పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేయాలని అక్కడున్న వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం చేపడుతున్న వైద్య పరీక్షలు, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలు రానున్న రోజుల్లో మంచి ఫలితాలను ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

ప్రజల చెంతకే వైద్యం..

పూసపాటిరేగ: ప్రజల చెంతకు వైద్యం తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని పతివాడ సచివాలయంలో పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 551 మంది వైద్యసేవలు పొందారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రజారోగ్యం విషయంలో మన రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎన్.సత్యనారాయణ రాజు, సర్పంచ్ ఆకుల పైడిరామ్, ప్రజాప్రతినిధులు పిన్నింటి నారాయణరావు, పి.సూరిబాబు, పి. సత్యం, పిన్నింటి ఎల్లంనాయుడు, ఎంపీడీఓ ఎం.రాధిక, తహసీల్దార్ ఇ. భాస్కరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై దుర్గాదేవి ఆశీస్సులు

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మహాశక్తి స్వరూపి అయిన దుర్గాదేవి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు చండీ అవతారాన్ని పురస్కరించుకుని విజయనగరం జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గా నవరాత్రి మంటపాల వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొండాడవీధిలోని కామాక్షమ్మకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం కొత్త అగ్రహారంలో ఉన్న గణపతి కామేశ్వరి సహిత గాయత్రీదేవి ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామాక్షమ్మ ఆలయ చైర్మన్ అప్పరభక్తుల సోమరాజు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం బొండాడవీధిలో కామాక్షిదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులోభాగంగా అమ్మవారు గురువారం లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శనమిచ్చారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కేదారశెట్టి లక్ష్మణమూర్తి, కొత్తాగ్రహారం గాయత్రీదేవి ఆలయంలో ఆలయ ప్రతినిధులు కొత్త నరసింహమూర్తి, పసుమర్తి గణేష్, నాగమల్లి గణపతిరావు, కాకినాడ భూషణం, అలమండ పాపయ్య శాస్త్రి, వరాహాచారి, తదితరులు పాల్గొన్నారు.



భోగాపురం: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

జగన్మాత ఆశీస్సులతో..

భోగాపురం: జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉంటాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రావాడలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటపాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మ ఆశీర్వాదంతో రానున్న ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు, సీతంనాయుడు, అప్పురభుక్త సూరిబాబు,, వెంకటరమణ, బండారు నాగు పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
● రింగ్‌రోడ్ రైతుబజార్ జంక్షన్‌లో బీటీ రోడ్డు ప్రారంభం

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో ప్రధాన రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని దాసన్నపేట రైతుబజార్ జంక్షన్ వద్ద నిర్మించిన బీటీ రహదారిని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొంతకాలంగా గతుకులమయంతో ఉన్న రోడ్డును ప్రజల కోరిక మేరకు రూ. 40 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. కార్పొరేటర్లు పొంతపల్లి మాలతి, నాయన పద్మ మాట్లాడుతూ, నగరంలో ప్రధాన రహదారులను ఏర్పాటు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి ప్రతిఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని చెప్పారు. లక్షల రూపాయలు వెచ్చించి రహదారులను అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. అలాగే నగరంలోని అనేక ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న ఘనత కోలగట్లకే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాయన మహేష్, పొంతపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం హర్షణీయం

● ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసిన బీసీ నాయకులు



జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీసీ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్రంలో బీసీ కులగణన చేయాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడంపై బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు ముద్దాడ మధుయాదవ్ హర్షం వ్యక్తం చేశారు. నవంబర్ 15 నుంచి సచివాలయాల వారీగా కులగణన చేయాలనుకోవడం గొప్ప నిర్ణయమన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బీసీలను అన్నిరంగాల్లోనూ ప్రోత్సహిస్తుండడం అభినందనీయమన్నారు. ఇంతవరకు ఏ ఒక్కరూ చేయని విధంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ప్రతి ఒక్క కులాన్నీ రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ బీకేవీ ప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్స్ కోడెల ఈశ్వరమ్మ, డి.చారిప్రసాద్, రౌతు భాస్కర్‌రెడ్డి, గొంప అప్పలరాజు, జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు ముత్యాలనాయుడు, బీసీ యువజన నాయకులు ఆదిబాబు, నమ్మి గోపి, నైదాన సతీష్, ముచ్చు శేఖర్, ఈగల సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

కొత్తపేట యాదవవీధిలో జాతీయ బీసీ సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ గదుల సత్యలత ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం విజయనగరం జిల్లా కన్వీనర్ బొద్దాన అప్పారావు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1951లో కుల గణన జరిగినప్పటికీ బీసీలకు న్యాయం జరగలేదన్నారు. నాటి నుంచి నేటి వరకు బీసీలకు కులగణన జరగక అనేక విధాలుగా అన్యాయానికి గురయ్యారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో నవంబర్ 15 నుంచి కులగణనకు ఆమోదించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కలపర్తి లక్ష్మి, సప్ప ప్రసాద్, బాలి ప్రతాప్, వేముల రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిగీతాల అనువాద పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న యనమండ్ర వేణుగోపాలశాస్త్రి

విజయనగరం టౌన్: ప్రముఖ సినీ సంగీత విద్వాంసులు మల్లాది సోదరులు ముత్తుస్వామి దీక్షితార్ సంస్కృతంలోని రాసిన సంగీత కృతులను తెలుగులోకి అనువదించి గురువారం స్థానిక శ్రీవిద్యాపీఠంలో ఆవిష్కరించారు. సంస్కృతంలోని అమ్మవారి ఆరాధనను తెలుగులోకి అనువాదం చేసి భక్తులకు అందజేస్తున్న మల్లాది సోదరులకు అమ్మ అనుగ్రహం ఎల్లవేళలా ఉంటుందని బ్రహ్మశ్రీ యనమండ్ర వేణుగోపాలశాస్త్రి అన్నారు. కార్యక్రమంలో అధిక ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

జామి: మండలంలోని చింతాడ గ్రామంలో సచివాలయ నూతన భవనం, కలగాడలో రైతుభరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించనున్నారని ఎంపీడీఓ ఎం.సతీష్ గురువారం తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు. అలాగే కలగాడలో నిర్వహించే జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శిస్తారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

అదనపు చార్జీలను రద్దు చేయాలి

● సీపీఎం నాయకులు



సదస్సులో మాట్లాడుతున్న తులసీదాస్

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యుత్ బిల్లులకు సంబంధించి వసూలు చేస్తున్న అదనపు చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యుడు తులసీదాస్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, రాష్ట్ర నాయకులు సుబ్బారావమ్మ, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యానారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్‌పీఆర్ భవన్‌లో జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ట్రూఆప్, ఎఫ్‌పీపీసీ సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారుపై భారం మోపుతున్నాయని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు పెరగడం వల్ల గతేడాది రూ. 1400 కోట్ల భారం వినియోగదారులపై పడిందన్నారు. గత పదేళ్ల నుంచి వినియోగించిన విద్యుత్‌కు బిల్లులు కట్టినా.. మళ్లీ సర్దుబాటు చార్జీల పేరుతో భారం మోపడం తగదని చెప్పారు. ఈ సదస్సులో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, రెడ్డి శంకరరావు, టీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఒమ్మిలో జగనన్న సురక్ష శిబిరం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిడుతూరి రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 8 గంటల నుంచి స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రారంభంకానున్న శిబిరాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, తదితరులు సందర్శిస్తారని పేర్కొన్నారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాలక్ష్మి అవతారంలో దుర్గాదేవి..



గాజులరేగ సాలివీధిలో గాజుల అలంకరణలో దుర్గాదేవి



మహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో వనంగుడిలో కొలువైన దుర్గాదేవి



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గాదేవి గురువారం మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితుడు వెలువలపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి సహస్ర, శ్రీ చక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తరించారు. అదేవిధంగా గాజులరేగ సాలివీధిలో అమ్మవారు లలితాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని గాజులతో అలంకరణ చేశారు. కొత్త దుప్పాడ 38వ డివిజన్ పరిధిలో బుధవారం రాత్రి అమ్మవారికి దీపారాధనలు చేశారు. అర్చకుడు మూర్తి ఆధ్వర్యంలో శివలింగం, త్రిశూలం, తదితర ఆకృతులలో దీపాలంకరణ చేశారు. కార్పొరేటర్ తొగరోతు సంధ్యారాణి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు తుమ్మగంటి రామ్మోహనరావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక సిటీబస్టాండ్ వద్ద కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీకే గాయత్రీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విజయనగరం: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: తనను విశ్వసించి ఓట్లు వేసి గెలిపించిన ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఇటువంటి గొప్ప పాలనకు మద్దతు తెలియజేస్తూ మరోసారి అవకాశం కల్పించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. నగరంలోని 3వ డివిజన్ ఫూల్‌బాగ్ వాడవీధి జంక్షన్ నుంచి గురువారం సాయంత్రం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ వజ్రపు సత్యగౌరి, వైఎస్సార్‌సీపీ నాయకులు మెండా రమణ, వజ్రపు శ్రీను, వేమూరి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సుంకరిపేట గ్రామంలో ఇంటింటి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న కోలగట్ల కృష్ణారావు

జగనన్నతోనే సంక్షేమం

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి సంక్షేమ సారథిగా నిలిచాడని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోలగట్ల కృష్ణారావు, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సుంకరిపేట గ్రామ పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల కృష్ణారావు, ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై వివరించారు. ఒక్కో కుటుంబానికి మంజూరైన పథకాలను వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొసర నిర్మల, సర్పంచ్ సుంకరి రాజేశ్వరి, ఎంపీడీఓ డి.తిరుపతినాయుడు, ఏఓ గంటా వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నిబాబు, దుర్గరాజు, బంగారునాయుడు, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు